## క్లుప్తంగా

### శింగరకొండ దర్శిని



అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, జ్యేష్ఠమాసం, అశ్వని నక్షత్రం, త్రయోదశి తిథి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర మంగళశారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

### రేపు విద్యా సంస్థల బంద్‌కు పిలుపు



సమ్మె నోటీసు అందజేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

అద్దంకి రూరల్: ఈనెల 4వ తేదీ గురువారం దేశవ్యాప్తంగా జరిగే విద్యాసంస్థల బంద్‌కు సహకరించి విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. అద్దంకి పట్టణంలో వివిధ విద్యా సంస్థలకు ఎస్ఎఫ్ఐ, విద్యార్థి ఫెడరేషన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు, పూర్వవిద్యార్థి సంఘ నాయకులు సమ్మె నోటీసు అందజేశారు.

### సెయింట్ ఆన్స్ స్కూల్‌లో ఎన్‌సీసీ సెలెక్షన్స్



ఎంపిక నిర్వహిస్తున్న ఇన్‌స్ట్రక్టర్

చీరాల రూరల్: స్థానిక మరియమ్మ పేటలోని సెయింట్ ఆన్స్ స్కూల్‌లో మంగళవారం ఎన్‌సీసీ సెలెక్షన్స్ నిర్వహించారు. ఎన్‌సీసీ ఇన్‌స్ట్రక్టర్ గొర్ల గోపీనాథ్, ప్రిన్సిపల్ సిస్టర్ జీనా జేవియర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈఎంపికల్లో 8 తరగతి చదువుతున్న 50 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు గోపీనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరడం వలన ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. చదువు, ఉద్యోగం, ఆర్మీ, పోలీస్, ఉన్నత చదువుల్లో రిజర్వేషన్ సౌకర్యం ఉంటుదని తెలిపారు. అన్నిటికంటే ముఖ్యంగా దేశానికి సేవ చేయడానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

# నకిలీతో రైతుకు విపత్తు

- విచ్చలవిడిగా మార్కెట్‌లో నకిలీ విత్తనాలు
- షాపులపై కొరవడిన అధికారుల నిఘా
- విత్తనం కొనుగోలు చేయాలంటేనే భయపడుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు





పీ.శ్రీనివాసరావు ఏవో కొరిశపాడు

మేదరమెట్ల: పంటకు మూలం విత్తనం. విత్తనం బాగుంటే దిగుబడి బాగుంటుందనేది నూటికి నూరు శాతం నిజం. దీన్ని ఆసరాగా తీసుకొని కొందరు విత్తన కంపెనీలు, దళారులు నకిలీ విత్తనాలను రైతులకు అంటగట్టి పబ్బం గడుపుకుంటున్నారు. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పులు పాలయ్యారు. పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర లేక రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉంటే మరో వైపు ప్రకతి విపత్తులతోనే రైతులు చిత్తవుతోంటే, నకిలీ విత్తు రైతును మరింత విపత్తుల్లోకి నెడుతోంది. ఎక్కడ చూసినా నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు హల్ చల్ చేస్తున్నాయి. ఇదే మంచి సమయం అని తలచిన వ్యాపారులు నకిలీ విత్తనాలను, నాణ్యమైన విత్తనాలుగా నమ్మబలికి విక్రయించడంతో పంట చేతికొచ్చే సమయంలో సరైన దిగుబడులు లేక రైతులు నష్టపోతున్నారు. రైతులు జాగ్రత్తలు పాటిస్తూ విత్తనాలు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారి పీ.శ్రీనివాసరావు సూచిస్తున్నారు.

**నకిలీలపై చర్యలేవి..**

నకిలీ విత్తనాలు, మందులు, ఎరువులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పాలకులు, అధికారులు ప్రకటనలు చేయడం తప్ప క్షేత్రస్థాయిలో ఆచరణలో పెట్టిన దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదనే విమర్శలు రైతుల్లో ఉన్నాయి. రైతుల అవసరాలను బట్టి దుకాణదారులు అప్పులకు ఎరువులు, పురుగుమందులు, నకిలీ విత్తనాలను అంటగట్టి, తరువాత అధిక వడ్డీలను వసూళ్లు చేస్తూ రైతులను జలగల్లా పీడిస్తున్నారు.

**మొక్కుబడి తనిఖీలతో సరి..**

షాపుల్లో తనిఖీలు చేపట్టాల్సిన అధికారులు దుకాణదారులతో కుమ్మక్కై నామమాత్రపు తనిఖీలతో సరిపెట్టడంతోనే నకిలీలు హల్‌చల్ చేస్తున్నాయని రైతులు విమర్శిస్తున్నారు. కేవలం అప్పటికప్పుడు షాపుల్లోకి తనిఖీలు చేసి మమ అనిపిస్తున్నారు. అంతేకాకుండా కొన్ని విత్తన కంపెనీలు వారితో చేతులు కలిపి మా విత్తనాలు బాగుంటాయని చెప్పి అమ్మకాలు సాగిస్తున్నారని సమాచారం. ఇప్పటికైనా అధికారులు మొద్దు నిద్రవీడాలని రైతులు కోరుకుంటున్నారు.

**ఇలా జాగ్రత్తలు పాటించాలి..**

- రైతులు విత్తనాలను కానీ, ఎరువులను కానీ, పురుగు మందులను కానీ కొనే సమయంలో తప్పనిసరిగా లైసెన్సు కలిగిన దుకాణం నుంచి మాత్రమే కొనుగోలు చేయాలి.
- కొనుగోలు చేసిన వాటికి తప్పకుండా బిల్లులు తీసుకోవాలి.
- కొత్త రకం విత్తనాలు కొనుగోలు చేసే ముందు వ్యవసాయాధికారులకు తెలిపి వారి సలహాలు, సూచనలు పాటించాలి.
- రైతులకు తెలిసిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలి.
- కొత్త రకం విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో మొలక శాతాన్ని పరిశీలించిన తరువాతనే కొనుగోలు చేయాలి.
- ఎప్పటికప్పుడు రైతులు అందుబాటులో ఉన్న వ్యవసాయాధికారులను సంప్రదించి వ్యవసాయం చేయడం ఎంతో మేలు.

# మిగిలిన పింఛన్ల పంపిణీ పూర్తి



యర్రంవారిపాలెంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ బాబూరావు

కారంచేడు: అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లను పంపిణీ చేశామని ఎంపీడీఓ బీ బాబూరావు తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని వివిధ గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పింఛన్‌ల పంపిణీని ఆయన పరిశీలించారు. మండలంలోని 14 గ్రామాల పరిధిలో మొత్తం 6086 మంది పింఛన్‌దారులు ఉన్నారన్నారు. వీరందరికీ గ్రామ సచివాలయ సిబ్బంది సుమారు 150 మంది ద్వార పంపిణీ పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవ: మండలంలోని 20 సచివాలయాల పరిధిలో మంగళవారం సాయంత్రానికి అన్ని పింఛన్లు పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీవో హనుమారెడ్డి తెలిపారు. 7841 మందికి వివిధ రకాల పింఛన్లు అందజేయాల్సిండగా దివ్యాంగులకు రూ.6 వేలు, డయాలసిస్, కిడ్నీ బాధితులకు రూ.15 వేలు, వృద్ధులు వితంతువులకు రూ.7 వేలు చొప్పున పింఛన్ అందజేశామని ఎంపీడీవో వివరించారు.

# ఆయాలకు పెండింగ్ జీతాలు ఇవ్వాలి



ఎంఈఓకు వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

చీరాల అర్బన్: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలకు ప్రభుత్వం వెంటనే పెండింగ్ జీతాలు వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ అన్నారు. పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణమే చెల్లించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల ఆయా స్వీపర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం చీరాల ఎంఈఓ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. శామ్యూల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఆయాలుగా పనిచేసే వారి పెండింగ్ జీతాలు తక్షణమే చెల్లించాలన్నారు. కరోనా సమయంలో గత ప్రభుత్వం ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టిందని నూతన ప్రభుత్వం నిజాయితీగా పనిచేస్తున్న ఆయాలకు పెండింగ్ జీతాలు చెల్లించాలన్నారు. జీవో నంబర్ 108 ప్రకారం ప్రభుత్వ పాఠశాల ఆయాలకు జీతాలు చెల్లించాలని ఆప్కాస్‌లో చేర్చి పారిశుద్ధ్య కార్మికులా జీతభత్యాలు ఇవ్వాలన్నారు. గత పదేళ్లకు పైబడి ఆయాలుగా పనిచేస్తున్నప్పటికి గుర్తింపు కార్డులు కాని, యూనిఫాం కాని లేవని ప్రభుత్వం వెంటనే సమస్యను పరిష్కరించాలన్నారు. ఆయాలకు బీమా సౌకర్యం కల్పించి ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం ఎంఈఓ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ చీరాల నియోజకవర్గ అధ్యక్షులు ఎ.బాబూరావు, కన్వీనర్ సుజాత, చీరాల కన్వీనర్, జొన్నాదుల భారతి, మేరికుమారి, ఇందిర, ఝాన్సీ, కోటేశ్వరమ్మ, షాహిన్, ఖలీల్‌బేగం, ముంతాజ్, సుజనా తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత



చినగంజాంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



స్వర్ణలో వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డాక్టర్ షాలిని

వేటపాలెం:

గ్రామాల్లో ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు పేర్కొన్నారు. మండలంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డెంగీ వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజలు డెంగీ, డయేరియా వ్యాధుల నుంచి జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కలుషితమైన నీరు, ఆహారం తీసుకోరాదన్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలన్నారు.

మలేరియా సబ్ యూనిట్ అధికారి చింతా శేషుబాబు మాట్లాడుతూ డెంగీ వ్యాధి వలన తీవ్రమైన జ్వరం, ఒళ్లునొప్పులు, కళ్లు చుట్టూ ఎర్రబడటం, శరీరంపై ఎర్రటి దద్దుర్లు, తీవ్రమైన నీరసం, నిస్సత్తువ కలిగి ఉండటం వంటి లక్షణాలు ఉన్న వారు వెంటనే దగ్గరలోని వైద్యశాల్లో చికిత్స చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డీటీ ప్రసన్న, సీహెచ్ఓ గురవమ్మ, సూపర్‌వైజర్స్ సుధాకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**వ్యక్తిగత శుభ్రతను అలవర్చుకోవాలి..**

స్వర్ణ (కారంచేడు): గ్రామాల్లో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రతను అలవర్చుకొనేలా అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షాలినీ అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని స్వర్ణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య సిబ్బంది సమావేశంలో మాట్లాడారు. వాతావరణంలో వస్తున్న మార్పులను బట్టి గ్రామాల్లో అతిసార వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతుందన్నారు. అందుకు తగినట్టుగా వైద్య సిబ్బంది ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన కల్పించాలన్నారు. అతిసార వ్యాధులు లక్షణాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే ప్రతి గర్భిని పేరును మూడువ నెల నుంచే నమోదు చేసుకోవాలన్నారు. నాలుగో నెల నుంచి ప్రతి గర్భిణికి అందించే సేవలను వారికి తెలియజేయాలన్నారు. ముఖ్యంగా హైరిస్క్ గర్భిణుల పట్ల ఏఎన్ఎంలు మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రసవ సమయం వరకు వారికి ఇచ్చే సేవలను తెలపాలన్నారు. 108 సహకారంతో వారిని ఆసుపత్రికి తరలించే కార్యక్రమంను దగ్గరుండి చేయాలన్నారు. నెలలో ఒకసారి అయినా డాక్టర్ చెకప్‌కు రావాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఈ మీనాకుమారి, హెచ్ఈఓ నాగేశ్వరరావు, హెచ్‌వీ మాధురీ సిఫోరా, ఎల్‌టీ బయ్యా శంకర్, స్టాఫ్‌నర్స్‌లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

**చినగంజాంలో..**

చినగంజాం పీహెచ్‌సీ పరిధిలో వైద్యులు, ఆరోగ్య సిబ్బందితో డెంగీ వ్యతిరేక మాసోత్సవం ర్యాలీ నిర్వహించారు. వైద్యులు ఎస్ విజయ భాస్కర్‌రావు, పి సాయిశ్రీ చరణ్ మాట్లాడుతూ సమాజ భాగస్వామ్యంతో డెంగీని నివారిద్దామన్నారు. 'దోమలు పుటకూడదు-దోమలు కుట్టకూడదు' అని నినాదం అందిరిలో రావాలన్నారు. ఇంటిముందు నీటి నిల్వలు లేకుండా చేసి దోమల ఉత్పత్తిని తగ్గిద్దామని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఝాన్సీరాణి, సూపర్‌వైజర్ చిరంజీవి, ఉల్లరాణి, శ్యాంసుందర్‌బాబు, మురళీ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపాలెంలో ఏకాహం



భజన నిర్వహిస్తున్న మహిళలు



అలంకరణలో స్వామి అమ్మవారు

బల్లికురవ: జేష్ఠమాసం, బహుళ ఏకాదశి సందర్భంగా మంగళవారం కొత్తపాలెం గ్రామంలోని సీతా రామ లక్ష్మణ హనుమత్ సమేత కోదండరామాలయంలో ఏకాహం చేపట్టారు. ఉదయం 5 గంటలకే అంకురార్పణతో స్వామి అమ్మవార్లకు వివిధ రకాల పుష్పాలు తులసీ దళాలతో అర్చకులు ఐ సుబ్బాచార్యులు, శివశాయి కృష్ణ ప్రత్యేక పూజలతో విశిష్ట అలంకరణ చేశారు. అనంతరం ఏకాహం ప్రారంభించారు. బుధవారం ఉదయం వరకు ఏకాహం కొనసాగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పాడి పంటలతో వర్షాలు కురిసి గ్రామం సుభిక్షంగా ఉండాలని స్వామి అమ్మవార్లను గ్రామస్తులు ప్రార్థించారు. ఈవేడుకలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# స్టాప్ డయేరియాపై అవగాహన అవసరం



ఇంకొల్లు పీహెచ్‌సీ పరిధిలో ర్యాలీలో వైద్యులు, సిబ్బంది



మల్లాపాలెంలో రోగిని పరీక్షించి మాట్లాడుతున్న వైద్యాధికారి



సుకన్య, పర్చూరు, పీహెచ్‌సీ

బల్లికురవ: గ్రామాల వారీగా ప్రజలకు పరిశుభ్రత 'స్టాప్ డయేరియా' కార్యక్రమంపై అవగాహన పెంచాలని గుంటుపల్లి పీహెచ్‌సీ అధికారి జీ. రవితేజ కోరారు. మంగళవారం మండలంలోని మల్లాయపాలెం గ్రామంలో 104 వాహనం ద్వారా ఉచిత క్యాంపు నిర్వహించారు షుగరు, బీపీ, హిమోగ్లోబిన్ పరీక్షలతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సాయంత్రం శిబిరానికి రాలేని వృద్ధులు, చిన్నారులకు ఇంటింటికి వెళ్లి పరీక్షలు చేసి మందులు అందజేశారు. వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది చేతుల పరిశుభ్రతపై చిన్నారులు, తల్లిదండ్రులను అవగాహన కల్పించాలన్నారు. మంచినీటి ట్యాంక్‌లను క్లోరినేషన్‌తో సురక్షిత మంచినీటి వాడకంపై అవగాహన కల్పించాలన్నారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..**

చినగంజాం (పర్చూరు): డయేరియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పర్చూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి సుకన్య అన్నారు. ఎక్కువసార్లు వాంతులు, విరోచనాలు అవుతుంటే వెంటనే సమీపంలోని ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. డయేరియా వల్ల మనిషి నీరసించి పోయే ప్రమాదం ఉందని తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు వచ్చిన పలువురు రోగులకు డయేరియాపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీరు, ఉడికించిన పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు.

**ఇంకొల్లులో..**

ఇంకొల్లు పీహెచ్‌సీ పరిధిలో వైద్యాధికారిణి టీ అంజలి ఆధ్వర్యంలో స్టాప్ డయేరియాపై అవగాహన ర్యాలీలు ప్రారంభించారు. అతిసార ప్రబలే ప్రమాదం ఉన్న ప్రాంతాల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. అక్కడ తగిన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆస్పత్రులకు వచ్చే కేసుల వివరాలు తీసుకుని, ఆ ప్రాంతాలకు వెళ్లాలని, వ్యాధి ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అంగనవాడీ కేంద్రాలు, పాఠశాలల్లో పరిశుభ్రతను విధిగా పాటించాలని సూచించారు. నాణ్యమైన భోజనం, తాగునీరు పిల్లలకు అందేలా చూడాలని అన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగేలా అవగాహన కల్పించాలని సూచించారు. అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆగస్టు నెల వరకూ అతిసార, విష జ్వరాల గురించి ప్రజలకు అవగాహన పెంచుతూ, వారు అప్రమత్తంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, వ్యాధులు ప్రబలకుండా నియంత్రించాలని ఆదేశించారు.

## ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు



వైద్యులు, అకౌంటెంట్స్‌ను సన్మానిస్తున్న రోటరీ ప్రతినిధులు

మార్టూరు: అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా సోమవారం రాత్రి మార్టూరులో డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎఫెక్ట్ కార్యాలయ ఆవరణలో మార్టూరు రోటరీ క్లబ్ నూతన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు డాక్టర్స్ డే తోపాటు చార్టెర్డ్ అకౌంటెంట్స్ డే కూడా కలిసి రావడంతో ఆ విభాగాలకు చెందిన పలువురిని సన్మానించారు. వైద్య వృత్తికి చెందిన డాక్టర్ జి భాను చంద్రనాయుడు, డాక్టర్ కొర్రపాటి సుబ్రహ్మణ్యం, అకౌంట్ విభాగానికి చెందిన కందిమల్ల రాకేష్, గోగినేని వనజ లక్ష్మి దంపతులను మార్టూరు రోటరీ క్లబ్ నూతన అధ్యక్ష కార్యదర్శులు మద్దుమాల కోటేశ్వరరావు, మాదాల సాంబశివరావులు ఘనంగా సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ వేలూరి కృష్ణమూర్తి, మోహన్ రావు, ఇతర రోటరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నగదు చోరీ

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో సోమవారం రాత్రి నగదు చోరీకి గురైంది. హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు వివరాల మేరకు.. స్థానిక నాగరాజుపల్లి రోడ్డులో సాయి మణికంఠ అపార్ట్‌మెంట్ ఎదురుగా దండా నాగేశ్వరరావు నివాసం ఉంది. మంగళవారం ఉదయం నిద్ర లేచి చూసిన నాగేశ్వరరావు తన ఇంటి తలుపులు తెరిచి ఉండటం గమనించి కంగారుగా లోపలికి వెళ్లి పరిశీలించాడు. గుర్తుతెలియని ఆగంతకులు తన ఇంటి తలుపులకు వేసిన తాళాలను ధ్వంసం చేసి షో కేసులో ఉంచిన రూ.70 వేల నగదును చోరీ చేసినట్లు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## కౌలురైతుల కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి



సీసీఆర్‌సీ కార్డులను అందజేస్తున్న ఆర్డీవో రవీందర్

యద్దనపూడి: ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌కు సంబంధించి కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు అందాలంటే తప్పనిసరిగా రెవెన్యూశాఖ జారీ చేసే కౌలు గర్తింపుకార్డు (సీసీఆర్‌సీ) తప్పనిసరిగా తీసుకోవాలని బాపట్ల ఆర్డీఓ రవీందర్ అన్నారు. మంగళవారం మండలంలోని పోలూరు గ్రామంలో సచివాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులను అందజేశారు. కౌలుకార్డు దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇతర వ్యవసాయ పథకాలు అందుతాయని, ఈ కార్డుల ద్వారా భూ యజమానులకు అందించే అన్ని పథకాల లబ్ధి కౌలు రైతులకు కూడా లభిస్తుందన్నారు. కౌలురైతులు గుర్తింపు కార్డుల కోసం రైతుల ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటో తీసుకొని వీఆర్వోకు అందజేస్తే కౌలు రైతులకు గుర్తింపు కార్డు జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు నాగరాజు, డిప్యూటీ తహశీల్దారు విష్ణు, వీఆర్వో శేషు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## ఉద్యోగికి సన్మానం



సుశీలను సన్మానిస్తున్న మున్సిపల్ సిబ్బంది

అద్దంకి రూరల్: అద్దంకి మున్సిపల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతిపై ఆత్మకూరుకు బదిలీ అవుతున్న పీ. సుశీలను స్థానిక కార్యాలయంలో మంగళవారం కమిషనర్ సత్యనారయణ, సిబ్బంది సత్కరించారు. అనంతరం పలువురు అమె సేవలను కొనియాడారు.

# మాదిగల జనజాతర జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఆర్పీఎస్ నాయకులు

చీమకుర్తి: మాదిగల జనజాతర సభను జయప్రదం చేయాలని ఎంఆర్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం చీమకుర్తిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జిల్లా అధ్యక్షుడు రావి నూతల కోటి ఆధ్వర్యంలో సభ్యులు జనజాతరకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. జూలై నెల 7వ తేదీ నాటికి ఎంఆర్పీఎస్ ఏర్పడి 30 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంఆర్పీఎస్ ఉద్యమం సరిగ్గా 30 సంవత్సరాల క్రితం నాగులుప్పలపాడు మండలం ఈదుమూడిలో ప్రారంభమైన సందర్భంగా మాదిగల జనజాతర సభను ఈదుమూడిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ నాయకులు బక్కా రాజు, చిన్న, కిషోర్, స్థానికులు పాల్గొన్నారు.